సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం ◆ 11 ◆ మార్చి ◆ 2023



పొగాకు బేళ్ల విక్రయం
డీసీపల్లి, కలిగిరిల్లో శుక్రవారం పొగాకు వేలం కొనసాగింది. రెండుచోట్ల కిలో పొగాకుకు గరిష్ఠంగా రూ.200 ధర లభించింది.

IIలో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.57,470
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,133
3శాతం జీఎస్టీతో	రూ.5,287
నవర (8గ్రా)	రూ.42,296

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
32.9 /23.6

శుక్రవారం గాలిలో 61 శాతం తేమ ఉంది. జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. శనివారం వాతావరణంలో ఎలాంటి మార్పు ఉండదు.

న్యూస్‌రీల్

భద్రతపై దృష్టి పెట్టాలి
• పోర్టు సీఈఓ జీజే రావు



మాట్లాడుతున్న సీఈఓ జీజే రావు

ముత్తుకూరు: ఉద్యోగులు, కార్మికులు వ్యక్తిగత భద్రతపై దృష్టి పెట్టాలని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జీజే రావు అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం పోర్టులో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతిఒక్కరిపై కుటుంబాలు ఆధారపడి ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అజాగ్రత్త వల్ల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఈ ఏడాది భద్రతా చర్యలు పాటించిన మెరైన్ డిపార్ట్‌మెంట్‌కి ఆయన రోలింగ్ షీల్డ్ అందజేశారు. భద్రత ప్రమాణాలు పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సేఫ్టీ హెడ్ రామకృష్ణ, మొహిత్ షెకావత్, జి.వేణుగోపాల్, శ్రీకాంత్, పాడియా తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి


మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్


నెల్లూరు(అర్బన్): ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జేసీ కూర్మనాథ్ కోరారు. నెల్లూరులోని తన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటింగ్ విధానంపై ఓటర్లకు పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి తరలింపు, భద్రత, మొదలైన అంశాలపై చేపట్టిన చర్యలను వారికి వివరించారు. సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ, బీజేపీ, టీడీపీ, సీపీఎం ప్రతినిధులు మురళీమోహన్, కాశేశ్వరరావు, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, తిరకాల దయాకర్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లకు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు



నెల్లూరు(క్రైమ్): ఈనెల 15వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల ప్రశ్నపత్రాలను శుక్రవారం జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు చేర్చారు. పోలీసు అధికారులు వాటిని భద్రపరిచారు. పరీక్షలు జరిగే తేదీల్లో వాటిని కట్టుదిట్టమైన భద్రత నడుమ కేంద్రాలకు తరలించనున్నారు.

సోమశిలలో 58.468 టీఎంసీలు


సోమశిల జలాశయం (ఫైల్)

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 58.468 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 2,100 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 473, దక్షిణకాలువకు 400, కండలేరుకు 100 క్యూసెక్కుల వంతున నీటిని నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.771 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 353 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

పోర్టు.. మరింత పెద్దదిగా..


రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు

రామాయపట్నం పోర్టు.. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే ప్రాజెక్టు ఇది. ఓ వైపు కలల ప్రాజెక్టు పనులు ప్రస్తుతం చకచకా జరుగుతోన్నాయి. మరోవైపు పోర్టు విస్తరణకు వేగంగా అడుగులు పడుతున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో రెండు బెర్త్‌ల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటి నిర్మాణం కూడా త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

- రామాయపట్నం పోర్టు నిర్మాణంలో మరో ముందడుగు
- తాజాగా ఇంకో రెండు బెర్త్‌ల కేటాయింపు
- ఇటీవల మంత్రివర్గం ఆమోదం
- గత జూలైలో భూమిపూజ చేసిన సీఎం వైఎస్ జగన్
- అప్పటి నుంచే చకచకా మొదటి దశ నిర్మాణం


సాక్షి ప్రతినిధి, నెల్లూరు/కందుకూరు: రామాయపట్నం పోర్టు నిర్మాణంలో మరో ముందడుగు పడింది. మొదటిదశలో చేపట్టిన నాలుగు బెర్త్‌లే కాకుండా కొత్తగా రెండు బెర్త్‌ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. తూర్పుతీర ప్రాంతంలోని గుడ్లూరు మండలం మొండివారిపాళెం వద్ద ప్రభుత్వ చేపట్టిన కీలక అభివృద్ధి ప్రాజెక్టు రామాయపట్నం పోర్టు. గత సంవత్సరం జూలై 20న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేసిన నాటి నుంచి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దశలవారీగా విస్తరించి భారీ పోర్టుగా తీర్చిదిద్దుతామని ఆనాడు సీఎం హామీ ఇచ్చారు.

మొదటిదశలో..

ప్రస్తుతం పోర్టు మొదటి దశ పనులు జరుగుతున్నాయి. రూ.3,736 కోట్ల ఖర్చుతో 25 మిలియన్ టన్నుల కార్గో కెపాసిటీతో నాలుగు బెర్త్‌ల నిర్మాణం చేపట్టారు. పనులు కీలకదశకు చేరుకున్నాయి. బ్రేక్ వాటర్ ఫీడర్ల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. సౌత్, నార్త్ బ్రేక్‌వాటర్ ఫీడర్ల నిర్మాణంతోపాటు, బెర్త్‌ల నిర్మాణం చేపట్టే ప్రాంతంలో సముద్రపు లోతును మరింతగా పెంచేందుకు డ్రెడ్జింగ్ చేస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ కల్లా మొదటిదశ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అనుగుణంగా నిర్మాణ సంస్థ అరబిందో ఇన్‌ఫ్రా ప్రతినిధులు కూడా కృషి చేస్తున్నారు. ఈ పనులు జరుగుతుండగానే ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అదనంగా మరో రెండు బెర్త్‌ల నిర్మాణానికి అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసింది.

జేఎస్‌డబ్ల్యూకి రెండు బెర్తులు

ఈ రెండు బెర్త్‌ల నిర్మాణాన్ని జేఎస్‌డబ్ల్యూకి అప్పగించారు. నాలుగు బెర్త్‌లతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా వాటిని చేపడతారు. అంటే కార్గో కెపాసిటీ మరింత పెరుగుతుంది. జిందాల్ స్టీల్స్ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో వారి వ్యాపార కార్యకలాపాలకు అనుగుణంగా ముడిసరుకుల రవాణా కోసం ఈ రెండు బెర్తుల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిసింది. దీని కోసం ప్రభుత్వం మరో 250 ఎకరాల భూమి కేటాయించనుంది. అయితే దీనిపై ఇంకా పూర్తిస్థాయిలో స్పష్టత రావాల్సి ఉంది. ఈ రెండు బెర్త్‌ల నిర్మాణం ఎంత కార్గో కెపాసిటీతో కడతారు? ఎన్ని వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తారనే విషయాలపై ఉన్నత స్థాయిలో అంగీకారం జరగాల్సి ఉంది. అలాగే మొదటి దశలో పనులు చేస్తున్న అరబిందో ఇన్‌ఫ్రాతో కూడా జేఎస్‌డబ్ల్యూ ఒప్పందం చేసుకోవాల్సి ఉంది. మొత్తంగా సాంకేతిక పరమైన అంశాలపై స్పష్టత వచ్చిన తర్వాత నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.


వేగంగా సాగుతున్న పోర్టు నిర్మాణ పనులు

పది బెర్త్‌లకు పెంచుతామని సీఎం హామీ
పోర్టు నిర్మాణానికి భూమిపూజ చేసిన సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. మొదటిదశలో నాలుగు బెర్త్‌లతో ప్రారంభించి దశలవారీగా విస్తరిస్తామన్నారు. మొత్తం రూ.10 వేల కోట్లతో ఖర్చుతో 10 బెర్త్‌లకు పోర్టు సామర్థ్యం పెంచుతామని చెప్పారు. కార్గో కెపాసిటీ పెరుగుతుందన్నారు. చెప్పిన విధంగానే పోర్టు విస్తరణకు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. భవిష్యత్‌లో సంబంధిత పోర్టు కార్యకలాపాలు ప్రారంభమైతే పోర్టు మరింత అభివృద్ధి చెందుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.


డ్రెడ్జింగ్ చేస్తున్న యంత్రం

రెండు అదనపు బెర్త్‌ల కేటాయింపు

ప్రస్తుతం రామాయపట్నం పోర్టు నిర్మాణంలో మొదటి దశలో మాకు నాలుగు బెర్త్‌లు కేటాయించారు. వీటి నిర్మాణం సాగుతోంది. రాష్ట్ర మంత్రివర్గం మరో రెండు అదనపు బెర్త్‌లను జేఎస్‌డబ్ల్యూకి కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. మేము నిర్మించే నాలుగు బెర్తులతో సంబంధం లేకుండా అదనంగా వారు రెండు బెర్త్‌లు నిర్మిస్తారు. దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. – ప్రతాప్‌రెడ్డి, పోర్టు ఎండీ

ఓటమి భయంతోనే ‘సహకారం’

- రెండో ప్రాధాన్యతా ఓటులో ఒకరికొకరు చేదోడు
- టీడీపీ, పీడీఎఫ్ నేతల మధ్య ఒప్పందం
- వైఎస్సార్‌సీపీ ధాటికి విలవిల



ఆది నుంచి అదే దారి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తూర్పు రాయలసీయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ప్రజా మద్దతుకు ప్రత్యర్థి పార్టీల్లో వణుకు పుడుతోంది. నిన్నమొన్నటి వరకు మేధావి వర్గమంతా మావైపే అంటూ ప్రగల్భాలు పలికిన పీడీఎఫ్ నేతలు నేడు టీడీపీ సహకారం కోసం కోసం అర్రులు చాచడంపై పట్టభద్రులు ఛీదరించుకుంటున్నారు. గెలుపు ధీమా ఉన్నప్పుడు రెండో ప్రాధాన్యతా ఓటు మాకే వేయాలని టీడీపీతో కలవడాన్ని చూస్తే ఓటమి ఒప్పుకున్నట్లేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక వైఎస్సార్‌సీపీ ప్రజా సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలపై మెండైన ప్రజాదరణతో దూసుకుపోతుంది. పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నికల సమరంలో ఒంటరిగానే పోటీ చేస్తోంది. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తూ విజయం సాధించేందుకు ఉవ్విళ్లూరుతోంది. అందుకు తగిన వ్యూహాలతో నాయకులు ముందుకు సాగుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నాంది పలికినప్పుడు తూర్పు రాయలసీయ నియోజకవర్గంలో పట్టభద్రుల ఎమ్మెల్సీలో ప్రతిసారి పీడీఎఫ్ అభ్యర్థులు ఇతర పార్టీల మద్దతుతోనే విజయం సాధిస్తూ వచ్చారు. ఉద్యమాలు, పోరాటాలని చెప్పే పీడీఎఫ్ నేతలు ఎప్పుడూ కూడా ఒంటరి పోరాటం చేసి విజయం సాధించిన దాఖలాల్లేవని విశ్లేషకులు చెబుతున్నారు. 2007లో పట్టభద్రుల ఎన్నికల్లో టీడీపీ తరఫున దేశాయిశెట్టి హనుమంతరావు పోటీ చేయగా, కాంగ్రెస్ సహకారం తీసుకుని పీడీఎఫ్ అభ్యర్థి విఠపు బాలసుబ్రహ్మణ్యం విజయం సాధించారు. అలాగే 2011లో అదే రిపీటైంది. ఆ ఎన్నికల్లో దేశాయిశెట్టి టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందారు. యండపల్లి శ్రీనివాసులురెడ్డి పీడీఎఫ్ అభ్యర్థిగా వేరే పార్టీల మద్దతుతో విజయం సాధించారు. 2017లో టీడీపీ హయాంలో వైఎస్సార్‌సీపీ పోటీ చేయలేదు. పట్టభద్రుల ఎన్నికల్లో యండపల్లి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ అభ్యర్థి పట్టాభిపై విజయం సాధించారు. మూడు దఫాలుగా పీడీఎఫ్ అభ్యర్థులు విజయం సాధించినా ఆయా వర్గాల సమస్యల పరిష్కారం పోరాడిన సందర్భాలు లేవని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోసారి పట్టభద్రులందరూ మావైపే అంటూ పీడీఎఫ్ అభ్యర్థులు చెబుతున్నా చివరకు టీడీపీ సహకారం తీసుకోవడంతో ఇదేనా వీరి బలమంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఉద్యోగావకాశాలు కల్పించిన వైఎస్సార్‌సీపీ వైపే పట్టభద్రులు మొగ్గుచూపుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన జేసీ కూర్మనాథ్, అధికారులు

- పోలింగ్‌కు వచ్చే సమయంలో గుర్తింపుకార్డు తప్పనిసరి
- 301 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం
- కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): ఈనెల 13న జిల్లాలో జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సర్వం సిద్ధం చేశామని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల సమన్వయంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రతి మండలంలో ఎస్‌సీసీ, ఎఫ్‌ఎస్‌టీ టీమ్‌లను సిద్ధం చేశామన్నారు. జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్లలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ రోల్ కాపీలను రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు అందించామన్నారు. పట్టభద్రులకు సంబంధించి 79, ఉపాధ్యాయులకు సంబంధించి 16 కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామన్నారు. వాటిలో పోలింగ్ ప్రక్రియపై వీడియో తీయిస్తామన్నారు. కాగా ప్రతి పోలింగ్ కేంద్రంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఓటర్లకు తాగునీటి వసతి కల్పిస్తున్నామన్నారు. ఇంకా వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశామన్నారు.

చిత్తూరుకు పంపుతాం

పట్టభద్రుల ఎన్నికకు 284 పెద్ద బ్యాలెట్ బాక్సులు, ఉపాధ్యాయ ఎన్నికకు 88 మీడియం బ్యాలెట్ బాక్సులు వినియోగిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. పోలింగ్ అయిన వెంటనే బ్యాలెట్ బాక్సులను నేరుగా చిత్తూరుకు పంపిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణకు 1,350 మంది పోలీస్, 1729 మంది పోలింగ్ సిబ్బందిని నియమించామన్నారు. విధుల్లో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని శనివారం వరకు కల్పించామన్నారు. ఇప్పటి వరకు 301 మంది అలా ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ఓటర్ స్లిప్‌ల పంపిణీ పూర్తి చేశామన్నారు. ఓటేసే వ్యక్తి ఓటర్ స్లిప్ తోపాటు ఎన్నికల సంఘం గుర్తించిన ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు తదితర 12 రకాల ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక కార్డును తీసుకురావాలన్నారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.1,12,850 నగదు, రూ.2,16,465 విలువైన మద్యం, 16 లీటర్ల నాటుసారా, 12 కేజీల గంజాయి, వెయ్యి లీటర్ల ఎఫ్‌జే వాష్, నాలుగు వాహనాలను సీజ్ చేశామన్నారు. పోలింగ్ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించామన్నారు.

ప్రచారం చేయొద్దు

శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎలాంటి ప్రచారం చేయరాదని, ఎగ్జిట్ పోల్ నిర్వహించడం, ఎన్నికల ఒపీనియన్ పోల్ నిర్వహించకూడదని చక్రధర్‌బాబు తెలిపారు. ఓటర్లు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఏఎస్పీలు హిమవతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై రంగడి విహారం


అశ్వవాహనంపై రంగనాథుడు

నెల్లూరు(బృందావనం): నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 9వ రోజు శుక్రవారం మధ్యాహ్నం సంప్రదాయంగా తిరుప్పావ్‌న్ధాడల్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి స్వామి అశ్వవాహనసేవలో భక్తులను అనుగ్రహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు జరిగాయి. విశేషాలంకారంలో కొలువైన స్వామిని భక్తులు దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. తిరుప్పావ్‌న్ధాడల్ ఉభయకర్తలుగా కిడాంబి వెంకటనరసింహాచార్యులు వారి వారసులు, అశ్వవాహన అలంకారోత్సవం ఉభయకర్తలుగా అత్రవణం కుటుంబం వ్యవహరించింది.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు ముసుగుల సేవ (ప్రణయ కలహోత్సవము), చక్రస్నానం, సాయంత్రం 6 గంటలకు పుణ్యకోటి విమానం అలంకారోత్సవం జరుగుతుందని ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి సాయంత్రం నుంచి మద్యం విక్రయాలు బంద్

నెల్లూరు(అర్బన్): ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పోలింగ్ సమయానికి 48 గంటల ముందు నుంచే మద్యం విక్రయాలను నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎన్నికలు సజావుగా జరిగేందుకు శనివారం సాయంత్రం 4 నుంచి సోమవారం సాయంత్రం 4 గంటల వరకు డ్రైడేగా ప్రకటిస్తున్నట్లు తెలియజేశారు. మద్యం దుకాణాలు, బార్లలో ఎట్టి పరిస్థితుల్లో మద్యం అమ్మకాలు జరపరాదన్నారు. ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసు, రెవెన్యూ అధికారులు దీనిని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.

13న పోలింగ్ కేంద్రాలుగా ఉన్న విద్యాసంస్థలకు సెలవు

చిత్తూరు కలెక్టరేట్: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలుగా ఉన్న విద్యాసంస్థలకు సోమవారం సెలవు ఉంటుందని రిటర్నిం గ్ అధికారి, చిత్తూరు కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం ప్రకటించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ నిర్వహించే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు సెలవు ఇస్తున్నట్లు తెలియజేశారు.

ఏకలవ్య ఆదర్శ పాఠశాలలో అడ్మిషన్లు

నెల్లూరు(వేదాయపాళెం): ఐటీడీఏ (యానాదులు) ఆధ్వర్యంలో ఏకలవ్య ఆదర్శ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరేందుకు పూర్తిస్థాయి సీట్ల తోపాటు 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేస్తున్నామని ఐటీడీఏ పీఓ మందారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కోసం http://aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొడవలూరు గురుకుల పాఠశాలలో ఆరో తరగతిలో 60 (30 బాలురు, 30 బాలికలు), ఏడో తరగతిలో 10 (బాలురు), 2 (బాలికలు), ఎనిమిదో తరగతిలో ఒకటి (బాలుడు), తొమ్మిదో తరగతిలో రెండు (బాలికలు) సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. దీనికి సంబంధించిన రాతపరీక్ష ఏప్రిల్ 30వ తేదీన కొడవలూరు మండలం చంద్రశేఖరపురంలోని ఏకలవ్య ఆదర్శ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో జరుగుతుందన్నారు. మే 10వ తేదీన మెరిట్ లిస్ట్ ప్రకటిస్తామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పొదుపు మహిళల సొమ్ము స్వాహా

- గత ప్రభుత్వంలో 'వెలుగు' ఉద్యోగుల చేతివాటం
- పొదుపు మహిళలు చెల్లించిన నగదును కాజేసిన ఉద్యోగులు
- కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న బాధితులు
- రికార్డుల గోల్‌మాల్



పొదలకూరులోని వెలుగు కార్యాలయం

పొదలకూరు: గత టీడీపీ ప్రభుత్వం పొదుపు మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతామంటూ డ్వాక్రా సంఘాల కోసం వెలుగు పథకాన్ని ప్రారంభించింది. అయితే ఆ పథకం వారి జీవితాల్లో చీకట్లను నింపింది. ఆ ప్రభుత్వంలో కొందరు ఉద్యోగులు నిధులను స్వాహా చేయడంతో ఇప్పటికీ పొదుపు మహిళలు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. రూ.లక్షల నగదును గోల్‌మాల్ చేసిన ఉద్యోగులు బాధితులకు సమాధానం చెప్పకుండా ఇతర మండలాలకు బదిలీపై వెళ్లి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. పొదలకూరు మండలంలో సుమారు 10 వేల పొదుపు సంఘాలు ఉండగా టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2014 నుంచి స్థానిక వెలుగు కార్యాలయంలో అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. అయితే బాధితులు సామరస్యంగా సమస్యను పరిష్కరించుకుని సంబంధిత వ్యక్తుల వద్ద నగదు రాబట్టుకునేందుకు ఇప్పటివరకు వేచి చూశారు. బాధిత మహిళలు ఉద్యోగుల ఇళ్లకు, అక్కడి కార్యాలయాలకు వెళ్లి నిలదీస్తున్నా న్యాయం జరగకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

నమ్మించి నట్టేట ముంచి..

టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు పొదలకూరు వెలుగు కార్యాలయంలో మొగళ్లూరు క్లస్టర్ సీసీగా పనిచేసిన ఉద్యోగి పొదుపు మహిళలను నమ్మించి నట్టేట ముంచినట్లుగా తెలుస్తోంది. ఆ ఉద్యోగి బ్యాంకు రుణాలను క్లస్టర్ పరిధిలో ఉన్న 9 గ్రామాల్లో పొదుపు గ్రూపులకు ఇప్పించాడు. అప్పట్లో మొగళ్లూరు గ్రామ ఎస్టీకాలనీకి చెందిన అక్షరజ్ఞానం లేని వారిని లక్ష్యంగా చేసుకుని నిధుల స్వాహాకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. బ్యాంకు, సెర్ప్ సంస్థ నుంచి రుణాలను తీసుకున్న పొదుపు మహిళలు నెలవారీగా చెల్లించే నగదును ఆ ఉద్యోగి తాను చెల్లిస్తానని నమ్మబలికి స్వాహా చేశాడని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్టీకాలనీకి చెందిన భాగ్యలక్ష్మి గ్రూపు నుంచి రూ.85,609, గాంధీ గ్రూపు నుంచి రూ.42,110, మమత గ్రూపు నుంచి రూ.1,35,027, సాయిలక్ష్మి గ్రూపు నుంచి రూ.20,954, శివపార్వతి గ్రూపు నుంచి రూ.83,816, శ్రీకామాక్షితాయి గ్రూపు నుంచి రూ.22,833, శ్రీలక్ష్మి గ్రూపు నుంచి రూ.1,03,407, వెంకటేశ్వర గ్రూపు నుంచి రూ.43,895, లక్ష్మి గ్రూపు నుంచి రూ.1,48,052, భారతి గ్రూపు నుంచి రూ.56,517.. ఇలా మొత్తం అన్ని గ్రూపుల నుంచి రూ.7,42,220 నగదు స్వాహా చేసినట్లు బాధితులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర విచారణ చేపడితే బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. నావూరు క్లస్టర్ పరిధిలో ఉన్న ఉలవరపల్లి ఎస్టీల నుంచి కూడా గతేడాది ఓ సీసీ ఇదే తరహాలో నగదు స్వాహా చేయడంతో వారు లబోదిబోమంటున్నారు. బ్యాంకర్లు రుణాలు రికవరీ కాలేదని పొదుపు సంఘాలకు నోటీసులు పంపుతుండడంతో ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

పూర్తి వివరాలు తెలియదు

గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై పూర్తి వివరాలు తెలియదు. అయితే పొదలకూరు మండలంలోని కొన్ని గ్రామాల నుంచి పొదుపు మహిళలు వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయానికి వచ్చి తమ నగదు స్వాహా చేశారని ఫిర్యాదు చేస్తున్నారు. అవసరమైతే పైఅధికారులకు రికార్డులను అప్పగిస్తాం. – రోజ్‌మేరీ, ఏపీఎం, పొదలకూరు



పసుపు-కుంకుమలో చేతివాటం

టీడీపీ ప్రభుత్వం 2019 అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహిళలను ఆకర్షించడానికి పసుపు-కుంకుమ కింద ప్రతి పొదుపు మహిళకు రూ.10 వేలు బ్యాంకు ఖాతాల్లో వేసింది. అయితే మండలంలో కొన్ని పొదుపు సంఘాలు రుణాలు చెల్లించకపోవడంతో వారి ఖాతాలను స్తంభింపజేశారు. అప్పట్లో కొన్ని సంఘాల ఖాతాలను కార్యాలయ సిబ్బందే పునరుద్ధరించి పసుపు-కుంకుమ నిధులు స్వాహా చేశారు. ఆ సమయంలో పొదలకూరు వెలుగు కార్యాలయం వద్ద మహిళలు గొడవలకు కూడా దిగారు. సంబంధిత రికార్డులు లభ్యం కాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు కూడా సమాచారం. ఇందులో రూ.లక్షలు చేతులు మారినట్లు ఇప్పటికీ ప్రచారం ఉంది.

ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

వెంకటాచలం: ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్వర్ణభారత్ ట్రస్ట్‌లో స్వర్ణభారత్ ట్రస్ట్, మెడికవర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న పాశ్చాత్య పోకడలకు దూరంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను ప్రసార మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పుల కారణంగా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రధానంగా 40 శాతం మంది క్యాన్సర్ లక్షణాలతో బాధపడుతున్నట్లు వైద్యులు పేర్కొనడం చాలా బాధాకరమన్నారు. ప్రతి ఒక్కరూ దేశ పురాతన ఆహారపు అలవాట్లకు ప్రాధాన్యతనిస్తూ, రాగులు, సజ్జలు, కొర్రలు, సామలు, ఇతర చిరుధాన్యాలను ఎక్కువగా వినియోగించాలని సూచించారు. ప్రతి రోజు వ్యాయామం తప్పనిసరిగా చేయాలని తెలిపారు. సెల్‌ఫోన్ అధికంగా వినియోగించడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, దానిని ఒక సాధనంగా మాత్రమే వినియోగించాలని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా జిల్లాలో ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ట్రస్ట్ వేదికగా తరచూ ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం జిల్లా ప్రజలకు వరమని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్యశిబిరంలో డాక్టర్లు రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్స్ సెంట్రల్ హెడ్స్ మహేశ్వరరెడ్డి, గణేష్, ఉదయ్ భాస్కర్, వైద్యులు దీక్షాంతినారాయణ్, మాధవదేశాయ్, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శుక్రవారం 746 పొగాకు బేళ్లు విక్రయించినట్లు వేలం నిర్వాహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 833 బేళ్లు రాగా వాటిలో 746 బేళ్లను విక్రయించామన్నారు. మిగిలిన 87 బేళ్లలో 18 నో సేల్, 62 నో బిడ్, 7 సీఆర్‌గా గుర్తించామని తెలిపారు. వేలంలో 99,794 కిలోల పొగాకు విక్రయం కాగా రూ.1,97,70,026 వ్యాపారం జరిగింది. గరిష్ట ధర కిలో ఒక్కింటికి రూ.200 కాగా, కనిష్ట ధర రూ.197 లభించింది. మొత్తం మీద సగటు ధర కిలో ఒక్కింటికి రూ.199.11గా నమోదైంది. వేలంలో 6 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కలిగిరిలో 350 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 364 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 364 బేళ్లను విక్రయానికి తీసుకురాగా 350 బేళ్లను కొనుగోలు చేశారని, 14 బేళ్లను తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.195, సగటున రూ.198.42 ధర లభించింది. వేలంలో 5 కంపెనీలు పాల్గొన్నాయి.

పోలింగ్ కేంద్రాల గుర్తింపు

నెల్లూరు(పొగతోట): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆమోదించినట్లు జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి 49 పోలింగ్ కేంద్రాలు, సర్పంచ్, వార్డులకుగాను 70 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో ఇద్దరు సర్పంచ్‌లు, 63 వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల్లో ఫొటోతో ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు తెలిపారు.

ఆర్‌ఎస్సార్ కళాశాలకు నాక్ 'ఏ' గ్రేడ్

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు నాక్(నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) 'ఏ' గ్రేడ్ లభించినట్లు ఆ కళాశాల డైరెక్టర్ కె.రాజారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీలో జాతీయ, అంతర్జాతీయ పత్రికలు, జర్నల్స్ తదితర సౌకర్యాలు కళాశాలలో విద్యార్థులకు కల్పించినట్లు తెలిపారు. ఈ అంశాలను పరిశీలించిన నాక్ కమిటీ కళాశాలకు 'ఏ' గ్రేడ్ అందజేసిందని తెలిపారు. ఈ సందర్భంగా కావలి ఎమ్మెల్యే, కళాశాల చైర్మన్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఆయన సతీమణి, కళాశాల సెక్రటరీ ఆదిలక్ష్మి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	93
లేయర్ (లైవ్)	75
బ్రాయిలర్ చికెన్	170
బ్రాయిలర్ స్కిన్‌లెస్	190
లేయర్ చికెన్	128

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	రూ.92
సన్నవి	రూ.85
పండ్లు	రూ.45

విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయండి

- జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్



బ్రాహ్మణక్రాక ఆర్‌బీకేలో రైతులతో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

జలదంకి: అధికారులు, సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేసి మంచిపేరు తెచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని బ్రాహ్మణక్రాక, కమ్మవారిపాళెం, చామదలలోని సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలను సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఉదయం 10.30 గంటల్లోపు బయోమెట్రిక్ వేసి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర ప్రకటించిందని, రైతులందరూ మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించుకునేలా చూడాలన్నారు. రైతులకు ధాన్యం కొనుగోలుకు గోతాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను కలెక్టరేట్ వరకు రాకుండా సచివాలయాల్లోనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సచివాలయ రికార్డులను తనిఖీ చేసి ప్రజలకు అందుతున్న సేవలపై ప్రశ్నించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ఎంపీడీఓ శ్రీధర్‌బాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గొర్రెలపై దూసుకెళ్లిన లారీ

- 18 జీవాల మృతి



లారీ చక్రాల కింద పడి మృతిచెందిన గొర్రెలు

కొండాపురం: వరి కోత మిషన్ లారీ గొర్రెల మందపై దూసుకెళ్లడంతో లారీ చక్రాల కింద పడి 18 గొర్రెలు మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలోని నేకునాంపేట ఎస్సీకాలనీ వద్ద చోటుచేసుకుంది. కొండాపురం ఎస్సై షేక్ ఖాజావలి తెలిపిన వివరాల మేరకు.. నేకునాంపేట ఎస్సీకాలనీకి చెందిన కలకట్ల రాజారావు తన 40 గొర్రెలను పంట పొలాల్లో మేత కోసం నేకునాంపేట నుంచి కొండాపురం వైపు తోలుకెళుతున్నాడు. ఈ క్రమంలో కొండాపురం నుంచి నేకునాంపేటకు వరికోత మెషీన్‌ను తీసుకువస్తున్న లారీ ఎస్సీకాలనీ వద్ద గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. దీంతో 18 గొర్రెలు లారీ చక్రాల కింద పడి మృతిచెందాయి. మరో 5 గొర్రెలకు కాళ్లు విరిగాయి. గొర్రెల యజమాని రాజారావు ప్రమాదాన్ని గమనించి పక్కకు దూకడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఘటన జరిగిన వెంటనే డ్రైవర్, వరికోత మెషీన్ యజమాని పరారైనట్లు ఎస్సై తెలిపారు. వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): కారణమేంటో స్పష్టంగా తెలియదు కానీ గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం తెల్లవారుజామున విజయమహల్ గేటు సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలుపట్టాలపై చోటుచేసుకుంది. అతను 45 నుంచి 50 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండి బులుగు, తెలుపు రంగు అడ్డ గీతలు గల హాఫ్ హ్యాండ్స్ టీషర్టు, బులుగు, తెలుపు రంగుల గళ్ల లుంగీ, నలుపురంగు వీకేసీ చెప్పులు ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): స్నేహితునితో విబేధాలో.. ఒంటరి జీవనమో.. స్పష్టమైన కారణం తెలియదు కానీ ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన సునంద(34)కు గతంలో వివాహమై భర్తతో విడిపోయింది. గాంధీబొమ్మ వద్ద ఆయుర్వేద ఆస్పత్రిలో పనిచేస్తోంది. ఈ క్రమంలో ఆమెకు సారాయంగడి సెంటర్‌కు చెందిన ప్రదీప్‌తో పరిచయమైంది. ఇద్దరూ సహజీవనం చేయసాగారు. వారిద్దరి నడుమ మనస్పర్థలు చోటుచేసుకోవడంతో ఆమె ఏడాదిగా ఒంటరిగా జీవిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 9న ఆమె పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను స్థానికులు చికిత్సనిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్సపొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందింది. ఈ మేరకు సునంద తమ్ముడు పవన్‌కుమార్ వేదాయపాళెం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కోవూరు: పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. మండలంలోని పడుగుపాడులో ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శుక్రవారం కోవూరు, బుచ్చి, సంగం, అల్లూరు, కొడవలూరు, విడవలూరు మండలాల ఏపీఎంలు, సీసీలు, వీఓఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పొదుపు మహిళలకు పలు రకాల రుణాలను అందించాలని తెలిపారు. రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం కొత్త ప్రణాళికలతో ముందుకుసాగుతుందని తెలిపారు. ఇప్పటికే పొదుపు సంఘాలను గ్రేడ్లవారీగా విభజించి అర్హతను బట్టి అధిక మొత్తంలో రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు.

దేహదారుఢ్య పరీక్షలు వాయిదా

నెల్లూరు(క్రైమ్): అసెంబ్లీ సమావేశాలు, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించాల్సిన కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. పరీక్షలు తిరిగి నిర్వహించే తేదీలను పోలీసుశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరుగుతుందని, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొంది.

నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించండి

నెల్లూరు(టౌన్): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఈ నెల 14వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించాలని డీఈఓ గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ ఉపాధ్యాయుడితో వ్యక్తిగత శుభ్రత, చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. రెండేళ్ల నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజనం తరువాత నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని తెలిపారు. జిల్లాలోని ఎంఈఓలు, పీహెచ్‌సీల సిబ్బంది సమన్వయంతో నులిపురుగుల నివారణ మాత్రలు పాఠశాలలకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

ఇందుకూరుపేట: మండలంలోని రావూరులో నమోదైన అట్రాసిటీ కేసుపై రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కొండా మస్తానయ్య టీ తాగేందుకు వెళ్లగా, అదే గ్రామానికి చెందిన బాలబొమ్మ కొండయ్య కులం పేరుతో దూషించాడని ఫిర్యాదు అందింది. దీనిపై డీఎస్పీ విచారణ చేపట్టారు. ఆయన వెంట సీఐ కె.రామకృష్ణారెడ్డి, ఎస్సై సీహెచ్ వాసు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పేద పిల్లలకు 25 శాతం సీట్లు

- 16 లోపు వివరాలు నమోదు చేయాలి

నెల్లూరు(టౌన్): ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టంలో భాగంగా 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో బడుగు, బలహీన వర్గాలు, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలకు ఉచిత సీట్లు కేటాయించనున్నట్లు డీఈఓ గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో వీరికి 25 శాతం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 16వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో పాఠశాలల వివరాలు నమోదు చేయాలని తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 18 నుంచి వచ్చే నెల 7వ తేదీ లోపు పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాల నమోదు, విద్యార్థుల రిజిస్ట్రేషన్ కోసం http@// cse. ap. gov. in వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచామని తెలిపారు. సచివాలయాల్లో ఉచితంగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.